# పరివర్తన

* * * *

శ్రీ ఘట్టా మంగపతి

శ్రీదినం వెంకడికెంత దుర్దశ! రాత్రింబవళ్లు కష్టపడినా వచ్చేది పావలా డబ్బులు ఆనాడు అది కూడా లేకుండాపోయింది— ఇంట్లోనా $\frac{1}{2}$ డజను పిల్లోల్లున్నారు. అందఱూ ఆదినం పస్తుపడి వుండాలిసిందే. వెంకడి భార్యచేతిలో కాసులేకపోయినా శ్రీ మహాలక్ష్మి కళమాత్రం ఆమె మొఖంలోని కుంకుమ బొట్టులో తాండవమాడుతుంటుంది. ఆమె నవ్వితే నోటినిండా ముత్తెపు చిప్పలున్నాయా యన్నట్టుంది. ఈలావుంది వెంకడింట్లో:

వెంకడు పనిచేసే సుదర్శనా Mill లో ఇంకా ఎన్నోమంది కూలీలు పనిచేస్తారు. వారికిగూడా ఈ గతే అయింది Mill చెడిపోవడంవల్ల, Mill (మిల్లు) సరిగావడానికి యింకా నాలుగురోజులు అయ్యేటట్టుంది. అంతవరకు వెంకడ్ని పోషించేవారెవ్వరు?—మిగత కూలీలకే! ఫరవాలేదు. నిలువబెట్టినడబ్బులున్నాయి. వీరికంతా వెంకడ్నిచూస్తే ఎంతో గౌరవం గౌరవమేగాక దయకూడానూ. వారివారికి దోచినంత యిచ్చి ఓ రెండురోజులు పోషించారు. ఇంకో రెండురోజులకేమి చెయ్యాలి— ఇంటివారి ప్రోద్భలముచేత కుచేలుడిలాగ బయలుదేరాడు, మిల్ మేనేజరు వద్దకు. మ్యానేజరుకేమి, కనికరమా!

"ఏమిరా, ఎందుకొచ్చావ్" అన్నాడు మేనేజరు.

"ఏమీలేదండి, ఊ..."

"ఏమి—ఊ...ఊ...లు"

"బిడ్డలు చాలామంది వున్నారండీ, వారిని పోషించడానికి యిప్పటో నావద్ద గవ్వకానైన లేదండీ."

"ఎక్కడైన బిక్షమెత్తూ, నావద్ద కెందుకొచ్చావ్?" అని గద్దించేడు మ్యానేజరు.

"మిమ్మల్ను అడగను వచ్చానండీ, పని చేసి చెల్లించేస్తాను?

'ఏమీ, చెల్లిస్తావా? నీ చెల్లింపులు నాకేమీ వద్దూ! ఆ వెంకటేశ్వర్లు కెత్తుకబోయి హుండీలో పడెయ్యి."

మీరిప్పుడేలాగైన న్యాయందు దయయుంచాలి బాబు. లేకపోతె బిడ్డలంతా మలమలా మాడి చావాల్సిందే. అందరు చిన్నపిల్లోల్లు.

ఈ మిల్లులో పనిచేసి, అందులోవచ్చే డబ్బుకు ఆధారపడి యుండేవాణ్ణి. యిప్పుడు తటాలున మిల్లు చెడిపోయింది. మరేపనిచేసి జీవిస్తామన్న యెక్కడెవ్వరు కూలీపని యిచ్చేవారు లేదు అని అతి దీనంగా అడిగేడు.

'వున్న డబ్బంతా మీ కూలీలకిచ్చే సాడైంది మా కొండ. మిల్లులో వచ్చే ఆదాయం అసలే లేదు వెళ్లు యింక చాలు ప్రసంగాలు!

'దయయుంచాలి బాబయ్యా'

'దయా, గియా, ఏమీలేదు పో— పోకుంటే ఏం చేస్తానో చూడూ—ఒరే రామూ, వీడ్ని గేటుకావల తరుము యని అర్జరిచ్చాడు.

రామునికి వెంకన్నంటే ఎంతో ప్రేమ. వెంకడి గుణాలు చాలా మెచ్చుకోతగ్గవి. రాముడంటే వెంకన్నొద్దకు వచ్చి కన్నీరు వదిలేశాడు. అప్పుడుచూస్తే రామునికి దుర్దశ ప్రాప్తించినట్టుంది. స్నేహితులంటే అలాంటివారే. పాపం వెంకన్న తన్ను వెళ్లగొట్టడానికి జంకి నిలబడి ఏడుస్తున్నాడేమో అనుకొని "రామయ్యా నేవెళ్తాలే, నీవేమి ఏడవనక్కరలేదులే"యని వెళ్లేడు. రాముడు వెంకన్న వెళ్లడంజూసి యింకా వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టి, తనకున్న తువాలును, తలపాగతీసి మానేజరుకు యిచ్చి నమస్కారం బెట్టేడు.

పాపం! వెంకన్న బిడ్డలంతా భిక్షమెత్తికొని వారిపొట్ట పోసుకొంటున్నారు. స్నేహితులంతా ఎంకడ్ని వచ్చిచూసుకొంటూంటారు అప్పుడప్పుడు.

* * *

వెంకడి భార్యకు పాపం నాలుగురోజులుగా అన్నమే లేదు. అంచేత బల్లిగావుంది. తటాలున ఆమె కాలికేదో తగిలి క్రిందపడ్డాది. క్రిందపడ్డతోనే ప్రాణాలు వదిలింది. ఆమె ప్రాణాలు వదలడంలోనే గొల్లుమని ఏడ్పు ప్రతిధ్వనించింది వీధులంతటా—ఆమె మంచిది కాబట్టే వీధిలోనివారంతా ఏడ్చారు.

అన్నీకూడా అంతే. ఇది సహజం. కష్టాలపై కష్టాలు, ఇలాంటప్పుడే అన్నీ సంభవించేది. ఆమెకు దహనాది కర్మాలు పూర్తిగా వారే చేశారు. పాపం ఆమె ప్రాణాలు వదిలేటప్పుడుకూడా కష్టాలు, సత్యహరిశ్చంద్రుడ్ని పట్టుకొన్నలాగ వదిలిందికాదు. బీదలకంతా ఎప్పుడు సుఖమో? మా నేజరు అంతా చూశాడు. ఇంకా చూస్తాడు. పాపం మలేరియా జ్వరంవచ్చి వెంకడ్ని పడగొట్టింది పడకమీదికి. మందూమాకులేకుండా జ్వరం పోతుందా? కొన్నాళ్ళకు వెంకడు కూడా పరలోకగతు డయ్యాడు. ఇంక మిగిలిందా బిడ్డలు.

వారిస్థితి యోచిస్తే, నా హృదయమంతా నీరై ప్రవహిస్తుంది. వెంకని శవంచూశాడు మా నేజరు. అతని గుండె వెన్నపూసలా కరిగిపోయింది. గడ్డగట్టిన మంచు సూర్యుని వేడికిరణాల కేలా కరిగిపోతుందో అలాగే కరిగిందతని శిలాహృదయం. అప్పుడు తలచుకొన్నాడు తన బిడ్డల్ని, భార్యని. ఇంకే వుదాహరణం కావాలి? అదేచాలు. ఇంకొకరింటి సమాచారం విచారించాలంటే తనయింటి సమాచారం గ్రహించాలి తొలుత. కన్నీరు కారిపోతున్నాది తనకు తెలీకుండాను. గబగబ మెట్లు దిగివచ్చి శవముదగ్గఱ కూర్చొన్నాడు. అందరూ ఆశ్చర్యపడ్డారు. తానే అన్ని కార్యాలు జరిపించేశాడు. అక్కడవుండే జనుల్నందరిని జూసి "అయ్యా నేను మహా పాపిని. నాకూలీలను తృణీకరించాను. ముందు రాముడు తన భృత్యుల నేలా చేశాడు. మా కూలీలంతా వెంకన్నకోసం సమ్మెకట్టేశారు. చాలా మంచి పని చేశారు. నావంటివాని కదే ప్రాయశ్చిత్తం.

నేను ఈ దినంనుండి నాకూలీలను నా బిడ్డలు మాదిరి చూసుకొంటాను. ఇదుగో ఈ వెంకన్న బిడ్డల్ని నాబిడ్డలుగా జూసికొని పోషిస్తాను" అని నిష్కర్షగా చెప్పేడు. అందరు అతనిని పొగిడారు.

వెంకన్న బిడ్డలు ఎంతో సంతోషంగా పెరుగుతున్నారు మా నేజరింట్లో. అతని హృదయం వికసించిన పుష్పంలాగుంది. వెంకన్న, అతని భార్య ఫోటోలు లేవు గానీ, వుంటే వారి పటాలమీద పూలు గప్పి పూజించేవాడు. ఇటువంటి మా నేజరులచే మన రాజ్యం తోరేది. వీరికంటే మహనీయులింకెవరు? కూలీలంతా మహా సంతోషులయ్యారు. వారిని చూచి ఆనందం పడుతున్నాడు మా నేజరు.


*SALE!* *SALE!* *SALE*

**Reduced Sale Price Rs. 3-12-0**



జెంట్స్ లివర్ రిస్టువాచ్ నెం. 44

పూర్వపు ధర రు 8. ఇప్పటి ధర రు 3-12-0. స్విజర్‌లాండ్ దేశములో లివర్ సామానులతో చేయబడినది. ఒక్క నిమిషమైనను తేడాలేక కాలం సరిగా చూపును. ఇండియా అంతటను అనేకవేలు యీమాదిరి గడియారములు అమ్మియుంటిమి. కాని యింత తక్కువ ధరలకు అమ్మియుండలేదు. చేతియందు ధరించిన బంగారపు ఆభరణమువలె యుండును. రోల్డుగోల్డు కేస్ నెం. 44, రు 3-12-0. 3 సం॥ గ్యారంటీ.

వెస్టరన్ స్విస్‌వాచ్ కంపెనీ, పోస్టుబాక్సు 68, మద్రాసు.

**WESTERN SWISS WATCH CO.,**
**Direct Importers. Post Box No. 68, Madras.**

